టికెట్లపై తలో'చేయి' కాంగ్రెస్‌లో సిగపట్లు

- పార్టీలో భగ్గుమంటున్న వర్గవిభేదాలు
- పెరుగుతున్న ఆశావహులు
- అభిప్రాయం తీరుపై నాగం ఫైర్
- నా తడాఖా చూపుతానని సవాల్
- ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని జగదీశ్వర్‌రావు అల్టిమేటం జారీ
- మక్తల్, నారాయణపేట, గద్వాల టికెట్లు స్థానికులకే ఇవ్వాలని పట్టు
- పాలమూరులో జీసీలకు ఇవ్వకుంటే అంతుచూస్తామని హెచ్చరిక

మహబూబ్‌నగర్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్‌లో టికెట్ల లొల్లి తారాస్థాయికి చేరింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినా ఇంకా టికెట్లు వ్యవహరం కొలిక్కిరాకపోవడంతో నేతల్లో అసహనం పెరుగుతున్నది. టికెట్లు దక్కుతాయే లేదో అన్న టెన్షన్ నేతలకు పట్టుకున్నది. టికెట్లు కేటాయింపులో అస్పష్టత వస్తుండడం.. సీనియర్లకు టికెట్లు గల్లంతు అవుతాయనే ప్రచారంతో కార్యకర్తలకు సర్దిచెప్పలేకపోతున్నారు. పార్టీని నమ్ముకున్న నేతలకు హ్యాండ్ ఇస్తున్నారన్న సంకేతాలతో ఏకంగా ఢిల్లీ, హైదరాబాద్ వేదికగా ధర్నాలు, నిలదీతలు కామన్‌గా మారిపోయాయి. గద్వాలకు చెందిన నేతలు ఏకంగా దేశ రాజధానిలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌ను నిలదీయడం చర్చనీయాంశంగా మారింది. టికెట్ అమ్ముకున్నారని బహిరంగంగా ఆరోపణలు గుప్పించడంతో ఖంగుతిన్నారు. కొల్లాపూర్‌లో టికెట్ తనకే కేటాయించకుండే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని సీనియర్ కాంగ్రెస్ నేత జగదీశ్వర్‌రావు హెచ్చరికలు జారీ చేశారు. తాజాగా నాగర్‌కర్నూల్‌లో మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి చక్రం తిప్పుతూ.. నేనేంటో నిరూపిస్తా.. అంటు శపథం చేశాడు. నారాయణపేట డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరికి మద్దతుగా మక్తల్‌లో ఆయన ఇంట్లో కాంగ్రెస్ నేతలు సమావేశమయ్యారు. టికెట్ ఇవ్వకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అంతకుముందు నారాయణపేటలో కూడా టికెట్ శివకుమార్‌రెడ్డికి ఇవ్వాలంటే కార్యకర్తలు డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్‌లో బీసీలకు టికెట్ కేటాయించాలని ఏకంగా పార్టీ కార్యాలయం ముందు శ్రేణులు ధర్నాకు దిగారు. వనపర్తి టికెట్‌ను మాజీ మంత్రి చిన్నారెడ్డికి ఇవ్వకుంటే పార్టీ చిన్నాభిన్నం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీని నమ్ముకున్న నేతలకు టికెట్లు రాకుంటే మూకుమ్మడి రాజీనామా చేస్తామని హెచ్చరికలు చేస్తున్నారు. ఇంకా టికెట్లు ఖరారు కాకపోవడంతో రోజుకో పేరు తెరమీదకు వస్తుండటంతో నేతల్లో అయోమయంలో ఉండగా.. కార్యకర్తలు మాత్రం అసహనానికి గురవుతున్నారు. మరోవైపు కాంగ్రెస్‌లో టికెట్లు తమకే వస్తాయని.. పైకాకాండ్‌ను మామూలుగా మేనేజ్ చేయలేదని, జడ్చర్ల, గద్వాల, మహబూబ్‌నగర్, కొల్లాపూర్ ఆశావహులు అంటుండటంతో పార్టీలో రెండు వర్గాల మధ్య సిగపట్లు తప్పడం లేదు.

నా తడాఖా చూపిస్తా.. : నాగం అల్టిమేటం

నాగర్‌కర్నూల్‌లో తన కుటుంబం కోసం పార్టీని సర్వనాశనం చేస్తున్న ఎమ్మెల్సీ కుచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఆయన కుమారుడు రాజేశ్‌రెడ్డికి పార్టీ టికెట్ ఇస్తారా? అంటు నాగం జనార్దన్‌రెడ్డి ప్రశ్నిస్తున్నారు. నాగర్‌కర్నూల్‌లో ఆయన తన అనుచరులతో భారీ ఎత్తున సమావేశమయ్యారు. ఎంతో సీనియరునను గత ఎన్నికల్లోనూ పార్టీ తరఫున పోటీ చేశా.. ఓడిపోయా.. ఈ బదేళ్లు బీఆర్ఎస్‌ను ఢీకొని పార్టీని బతికించిన తనకు టికెట్ ఇవ్వకుంటే తా తడాఖా ఏమిటో చూపిస్తానని హెచ్చరించారు. ఆయనేమన్నా పార్టీకోసం టికెట్ అడుగుకున్నాడా? తన కుటుంబం కోసం పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని ధ్వజమెత్తడం నాగర్‌కర్నూల్‌లో చర్చనీయాంశంగా మారింది. నాగం సమావేశం నిర్వహించాక కూచుకుళ్ల వర్గీయులకు ముచ్చెమటలు పట్టాయి. కొల్లాపూర్‌లో కూడ సేమ్ సీన్ రిపీట్ అవుతుంది. పార్టీలు మారుతున్న జూపల్లికి టికెట్ ఇస్తే తాను ఇండిపెండెంట్‌గా పోటీకి దిగడం ఖాయమని కాంగ్రెస్ నేత జగదీశ్వర్‌రావు అధిష్టానానికి అల్టిమేటం ఇచ్చారు. పార్టీ మారినంత మాత్రాన టికెట్ ఇస్తారా? అంటూ ప్రశ్నించారు. పార్టీ ప్రయోజనాలను ఢిల్లీ పెద్దలు కాపాడాలని.. పార్టీని రక్షించాలని కార్యకర్తలు కోరుకుంటడం గమనార్హం.

టికెట్లు అమ్ముకున్నారంటూ గద్వాల నేతల లొల్లి

గద్వాల పార్టీ టికెట్‌ను ఇటీవల బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఓ నేతకు అమ్ముకున్నారని ఓ ఆడియో క్లిప్ వైరల్‌గా మారింది. మా మేడంకు టికెట్ ఖాయం.. అంతా మేనేజ్ చేసుకున్నాం.. డబ్బులు ఇచ్చినం.. మాకే టికెట్ వస్తుందని ఇద్దరు కార్యకర్తలు మాట్లాడుకున్నట్లు ఉన్న ఆడియో క్లిప్ కాంగ్రెస్ నేతలకు ముచ్చెమటలు పట్టించింది. దీంతో పార్టీ టికెట్ ఆశిస్తున్న విజయ్‌కుమార్ ఏకంగా ఢిల్లీలో ఏఐసీసీ కార్యాలయం వార్‌రూమ్ ముందు ధర్నాకు దిగారు. అంతేగాక టీపీసీసీ చీఫ్ రేవంత్‌ను నిలదీయడంతో ఖంగుతిన్నారు. దీంతో ఈ వ్యవహారం మీడియాలో చర్చనీయాంశంగా మారింది. వనపర్తిలో కూడా మాజీ మంత్రి చిన్నారెడ్డిని కాదని టికెట్‌ను బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఓ కాంట్రాక్టర్‌కు కట్టబెడుతున్నారన్న ప్రచారం కూడా ఆరోపణలకు తావిస్తోంది. ఈ టికెట్లను కోట్లకు అమ్ముకున్నారని కార్యకర్తలే బాహాటంగా గుసగుసలాడుతున్నారు. అక్కడ గెంటితే ఇక్కడకు వచ్చిన సదరు నేతకు టికెట్ ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. మహబూబ్‌నగర్‌లో కూడ బీసీలకు టికెట్‌లు ఇవ్వకుండా బీజేపీ నుంచి వచ్చిన ఓ అగ్రవర్ణ నేతకు టికెట్ ఇస్తే సహకరించమని.. బీసీ నేతలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ కార్యాలయం ముందు శ్రేణులు బైఠాయించాయి. మక్తల్‌లో బీసీ నేత వాకిటి శ్రీహరికే టికె ట్ ఇవ్వాలని కార్యకర్తలు ఆందోళనకు దిగారు. కల్వకుర్తిలో తనను కాదని ఇటీవల పార్టీ మారిన బీఆర్ఎస్ నేతకు ఇవ్వడం ఏమిటని ఆ పార్టీ ఎన్ఆర్ఐ స్టేట్ ప్రెసిడెంట్ నిలదీస్తున్నారు. కాంగ్రెస్‌లో టికెట్ల కోసం సిగపట్లు పడుతుండటంతో కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు.

టికెట్లపై కాంగ్రెస్‌లో ఆరని మంటలు

ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో టికెట్ల యుద్ధం తారాస్థాయికి చేరింది. చాలామంది ఏండ్ల తరబడి పార్టీని నమ్ముకున్న వారిని కాదని పార్టీలు మారిన వారికి టికెట్లు కేటాయిస్తున్నట్లు వస్తున్న సంకేతాలతో తీవ్ర అసహనం వ్యక్తమవుతున్నది. టికెట్లు ప్రకటిస్తే ఇంకా ఎన్ని ఆందోళనలు లేపడిస్తారో అని నేతలే అంటున్నారు.పార్టీ టికెట్లు ప్ర జాభిష్టం మేరకు ఇవ్వకుంటే పార్టీకి సర్వనాశనం తప్పదని సీనియర్లు హెచ్చరిస్తున్నారు. ఇంకా టికెట్లు ప్రకటించడానికి ఎంత సమయం పడ్తుందని నిలదీస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్న ది. టికెట్ల వ్యవహారంలో నాన్చివే త ధోరణి మంచిదికాదని సూచిస్తున్నారు. ఈ సంస్కృతి ఎక్కడా చూడలేదని ద్రవజమెత్తుతున్నారు.

తొమ్మిది రోజులపాటు జాతరలా సాగే బతుకమ్మ పండుగ తెలంగాణ వాకిట్లో బతుకుదెరువును ఆవిష్కరిస్తుంది. తెలంగాణ సాంస్కృతిక జీవన వైవిధ్యానికి నిలువుటద్దంగా నిలుస్తుంది. తంగేడు, గునుగు, కట్ల, గుమ్మడి, గన్నేరు, రుద్రాక్ష, బంతి, చేమంతి, బీర, కాకరవంటి ప్రకృతి పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు తెలంగాణ అస్థిత్వానికి ప్రతిబింబాలు. పేర్చిన పూలు, గుమ్మడి పూల మధ్యలోఉండే పుప్పొడి లేదా పసుపు ముద్దను(గౌరీదేవిని) ఉంచి ప్రకృత మట్టి ప్రమిదలో అగరవత్తులను వెలిగించి మగువలు నిర్వహించే పూజలు ఆధ్యాత్మికతకు ప్రతిరూపాలుగా నిలుస్తాయి.. బతుకమ్మ పండుగ రోజులన్నీ పల్లెలు, పట్నాలు పూలమనాలవుతాయి.

– నాగర్‌కర్నూల్ (నమస్తే తెలంగాణ)/కల్వకుర్తి, అక్టోబర్ 13

బతుకమ్మ పండుగ చారిత్రక నేపథ్యం

బతుకమ్మ పండుగ వెనుక చాలా చారిత్రక నేపథ్యాలు ఉన్నాయి. ఒక బాలిక భూస్వాముల అక్కత్యానాలను భరించలేక ఆత్మహత్య చేసుకుంటే.. ఆమెను ఆ ఊరి ప్రజలందరూ 'బతుకమ్మ' అని దీవించారట. అందుకే ఆ పండుగ స్త్రీలకు సంబంధించిన బతుకమ్మను కీర్తిస్తూ జరుపుకొంటారట. తమకు, తమ పతులకు ఆపద రావొద్దని గౌరమ్మను ప్రార్థిస్తారు.

.. అలాగే మరో కథ ప్రాచుర్యంలో ఉన్నది.. దక్షిణ భారతాన్ని పాలించిన చోళవంశ చక్రవర్తి ధర్మాంగదుడు సంతానం లేక అనేక పూజలు చేశాడట. ఆయన భార్య గర్భవతి అయి లక్ష్మీదేవి అనుగ్రహంతో కూతురుకు జన్మనిచ్చింది. పసిబిడ్డకు అనేక గండాలు గట్టెక్కడంతో దిన్నాళికి బతుకమ్మ అనే పేరు పెట్టారు. అప్పటి నుంచి యువతులు సైతం మంచి భర్త రావాలని బతుకమ్మను కొలవడం ఆనవాయితీగా మారింది. మరో వృత్తాంతం ప్రకారం.. ఓ ముద్దుల చెల్లికి ఏడుగురు అన్నదమ్ములు. వారికి చెల్లెలంటే ప్రాణం.. కాని వదినలకు మాత్రం అసూయ. బంగారు బొమ్మను బాధలు పెట్టేవారు. ఓ రోజు వేటకెళ్లిన అన్నలు చాలా రోజులపాటు తిరిగి రాకపోవడంతో.. ఇదే అదనుగా వదినలిచిన వదినలు బంగారు బొమ్మను సూటిపోటి మాటలతో వేధించారు. యాతన తట్టుకోలేక చెల్లెలు ఇల్లు వదిలి వెళ్లిపోతుంది. ఆ తర్వాత అన్నలు ఇంటికి వచ్చి ముద్దుల చెల్లెలు ఎక్కడని వారి భార్యలను నిలదీశారు. విషయం అర్థం చేసుకున్న అన్నలు తిండీతిప్పలు మానేసి చెల్లెలు కోసం పల్లెలు, గుట్టలు వెతికారు. ఓ తొరి పొలిమేర పద్ద బావిలో దాహం తీర్చుకుంటుండగా పెద్ద తామర పువ్వు కనబడింది. వాళ్లను చూడగానే నీటిలో తేలుతూ దగ్గరకు వచ్చింది. అప్పుడే అక్కడకు వచ్చిన ఆ దేశపు రాజు ఆ పూవును తీసుకెళ్లి తన తోటలోని కొలనులో వేశాడు. కొలను చుట్టూ దట్టంగా తంగేడు మొక్కలు మొలిచాయి. కొంతకాలానికి విష్ణుమూర్తి దిగి వచ్చి తామరను మనిషిగా మార్చాడు. ఆమె శ్రీలక్ష్మీ అవతారమని ప్రకటించాడు. పువ్వులకు బతుకుదెరువు చూపించి కాబట్టి బతుకమ్మ అయ్యింది. మరో జానపథగాథ.. మహిషాసురుడిని చంపిన తర్వాత సొలసి మూర్ఛపోయిన అమ్మవారికి మహిళలంతా కలిసి పాటలతో స్పృహ తెప్పించే ప్రయత్నం చేశారని మరో ఇతిహాసం ఉన్నది. ఆత్మ త్యాగంతో తెలంగాణను వరద బారి నుంచి కాపాడిన త్యాగమూర్తే బతుకమ్మ అనే వాదన కూడా ఉన్నది. ఎన్ని కథలు, ఇతిహాసాలు ఎలా ఉన్నా.. బతుకమ్మ పండుగ మాత్రం తెలంగాణ అస్థిత్వానికి, మట్టి వాసనకు ప్రతీకగా నిలుస్తుంది.

.. మరో చారిత్రక నేపథ్యం కూడా ఉన్నది. వేయి సంవత్సరాల కిందట తెలంగాణలో రాష్ట్ర కూటులు, చోళులకు జరిగిన యుద్ధంలో వేములవాడలోని శివలింగాన్ని పార్వతి నుంచి వేరు చేసి తంజావూరులోని బృహదీశ్వరంకు తరలించినందుకు తెలంగాణ ప్రజల మనస్సు కలచి వేసింది. దీంతో తమ దుఃఖాన్ని తెలియజేసేందుకు మెరూ పర్వతంలా పూలను పేర్చి బతుకమ్మ పండుగను నిర్వహించడం మొదలు పెట్టారు. ఇలా బృహదీశ్వర పేరు నుంచి ఈ పండుగను బతుకమ్మగా రాష్ట్రంలో జరుపుకొంటున్నారు. శివుడు లేని పార్వతి గురించి పాటల రూపంలో పాడుకూ ఆడపడుచులు తొమ్మిది రోజులు ఘనంగా సంబురాలతో చేసుకొంటూ వస్తున్నారు. ఇదిలా ఉండే పురాణ గాథ కూడా ఒకటి ఉంది. రాజైన ధర్మాంగుడు, సత్యవతి దంపతులు యుద్ధంలో సర్వం కోల్పోతారు. ఈ బాధలో అడవిలోకి వెళ్లి లక్ష్మీదేవిని పూజించి తనకు కూతురుగా పుట్టాలని కోరుతారు. దీంతో లక్ష్మీమాత కూతురుగా పుట్టగా ఆయురారోగ్యాలతో వల్లగా బతుకమ్మా అని మునీశ్వరులు దీవిస్తారు. ఈ పేరు నచ్చి రాజు తన కూతురికి అదే పేరు పెడతారు. ఇలా లక్ష్మీదేవి పుట్టడంతో రాజుకు రాజ్యం, ఐశ్వర్యాలు తిరిగి లభిస్తాయి. అనంతరం కూతురుకు పెళ్లి చేసి పూలతో అలంకరించి మెట్టినింటికి పంపుతాడు. ఇలా చారిత్రక, పురాణ నేపథ్యాలున్నాయి.

ఒక్కో రోజు ఒక్కో విధంగా..

ఎంగిలిపూల బతుకమ్మ రోజు నువ్వులు, నూకలను నైవేద్యంగా అర్పిస్తారు. అటుకుల బతుకమ్మలో భాగంగా అమ్మవారికి చప్పిడి పప్పు, బెల్లం, అటుకులను జగన్మాతకు నైవేద్యంగా పెడుతారు. మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మ నిర్వహించి అమ్మవారికి ముద్దపప్పు, పాలు బెల్లం వంటకాలను ప్రసాదంగా చేసి నైవేద్యంగా పెడతారు. నాన బియ్యం బతుకమ్మలో నానబెట్టిన బతుకమ్మలో పాలు, బెల్లం, నానబెట్టిన బియ్యంతో, అట్ల బతుకమ్మలో ఉప్పుడు బియ్యం, అట్లను జనని విశ్వమాతకు నైవేద్యం పెడతారు. అలిగిన బతుకమ్మను ఏర్పాటు చేసి అమ్మవారు అలిగిందని ఆడపడుచులు భావించి బతుకమ్మలను పేర్చి నైవేద్యం పెట్టకుండా ఆటలు ఆడతారు. వేపకాయల బతుకమ్మలో సకినాల పిండిని వేపకాయలుగా చేసి, వెన్నెముద్దల బతుకమ్మలో నువ్వులు, వెన్న, బెల్లం, నెయ్యితో చేసిన ఫలహారం అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా ఐదు రకాల నైవేద్యాలు పెరుగన్నం, కొబ్బెర, నువ్వులు, పులిహోర, నిమ్మకాయలతో చేసిన వంటకాలతో పాటు గోదుమ రొట్టెలు బెల్లం కలిసి మలీదా వంటకం చేసి అమ్మవారికి నేవేద్యం పెడతారు. 8 రోజులు పాటు తమ ఇండ్ల ముందు బతుకమ్మలు పేర్చి ఆట పాటలతో ఆడపడుచులు ఆలరించనున్నారు. 9వ రోజు ఊరి మధ్యలో బతుకమ్మలతో ఆటపాటలు పాడి పేర్చిన బతుకమ్మలను నిమజ్జనం చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో సంబురాలు శనివారం షురూ కానున్నాయి. తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక బతుకమ్మ పండుగకు కొత్త ఊపు వచ్చింది. ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించడంతో పాటు బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్నది.

ఈ సంవత్సరం అక్టోబర్ 14న అమావాస్య (శనివారం) రోజు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమవుతున్నది. 22న అష్టమి అదివారం రోజు సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. కాగా అక్టోబర్ 24న దశమి రోజున పండుగను పరుపుకోనున్నారు. తొమ్మిది రోజులు ఏ రోజుకు ఆరోజు ప్రత్యేకంగా పూజించడం ఈ పండుగ ప్రత్యేకత. ప్రతిరోజూ సాయంత్రం వేళల్లో అమ్మవారిని తంగేడు, తామర, జిల్లేడు, గునుగ, బంతి, చేమంతి, నందివర్ధనంలాంటి వివిధ రకాల పూలతో పేర్చి చుట్టూ రెండు చేతులతో చప్పట్లు కొడుతూ 'బతుకమ్మ బతుకమ్మ' అంటూ రకరకాల పాటలు పాడుకుంటూ కొలుస్తారు.

పూలను రాగి పళ్లెంలో వలయాకారంగా, రంగులు మార్చుకుంటూ పేరుస్తారు. ముందుగా తంగేడు ఆకులు, పూలు పల్లెంలో పేర్చుతారు. ఆపై తంగేడు పూల కట్టలు పేర్చుతారు. మధ్యమధ్యలో ఇతర రకాల పూలను ఉపయోగిస్తారు. అలాగే జిల్లెని గునుక పూలను రంగులతో అద్ది పెడతారు. ఇది పూర్తయ్యాక పైన పసుపుతో చేసిన గౌరీ మాతను పెడుతారు. ఇలా తయారు చేసిన బతుకమ్మను ఇంట్లోని దైవస్థానంలో పెట్టి కొవ్వొత్తులు, అగరొత్తులతో అలంకరించి పూజిస్తారు. ప్రతి రోజూ బతుకమ్మలు ఆడిన అనంతరం చెలువులో నిమజ్జనం చేస్తారు. ఆపై పళ్లెంలో తెచ్చిన నీటితో పడతులు 'వాయినమమ్మా.. వాయినం'.. అంటూ వాయినాలు ఇచ్చి పుచ్చుకొంటారు. తర్వాత ఇంటి నుంచి తీసుకువచ్చిన పెరుగు అన్నం, సత్తుపిండి (మొక్కజొన్నలు లేదా వేరుశనగ లేదా పెసర విత్తనాలను దోరగా వేయించి వాటిని పిండి చేసి వాటితో చక్కెర పిండి లేదా బెల్లం, నెయ్యి తగినంత కలిపి తయారు చేస్తారు)ని ఇచ్చి పుచ్చుకొని తింటారు. ఇలా ప్రకృతితో మమేకమైన పండుగ బతుకమ్మ. జానపద పాటలతో గౌరీదేవిని కొలిచే పడతుల పండుగ. ఈ పూవులతో చేసిన బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనం చేయడంతో సూక్ష్మక్రిములు చనిపోయి నీరు శుద్ధి అవుతుంది. గునుగు పువ్వులు జీర్ణకోశాన్ని శుద్ధి చేస్తాయి.

దసరాకు ప్రత్యేక బస్సులు..

దసరాకు వచ్చే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా అన్ని డిపోల నుంచి అదనపు బస్సు సర్వీసులు నడుపిస్తున్నాం. రీజియన్ పరిధిలో 9డిపోల నుంచి 374 బస్సులు నడిపించేందుకు ఏర్పాటు చేశాం. దసరా పండుగను పురస్కరించుకొని ఈనెల 21 నుంచి 29వ తేదీ వరకు, మళ్లీ 28 నుంచి 30వ తేదీ వరకు బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు టీఆర్ఎస్ ఆర్టీసీ ఆఫర్ ప్రకటించింది. ఆ తేదీల్లో ప్రయాణించే ప్రయాణికులు టికెట్ వెనుకపేరు, ఫోన్ నెంబర్ రాసి బస్టాండ్లలోని డ్రాప్ బాక్సుల్లో వేయాలి. ప్రతి రీజియన్ పరిధిలో ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలను ఎంపిక చేసి నగదు బహుమతులు అందజేస్తాం. డ్రా ద్వారా ఎంపిక చేసి రాష్ట్రవ్యాప్తంగా 110 మందికి ఒక్కొక్కరికి రూ.9900 చొప్పున రూ.11 లక్షల నగదు బహుమతి ఇవ్వనున్నారు.

–వి.శ్రీదేవి, ఆర్టీసీ ఆర్ఎం, మహబూబ్‌నగర్

దసరా ధమాకా

- 374 అదనపు బస్సులు కేటాయించిన ఆర్టీసీ
- ప్రయాణికులకు లక్కీడ్రా ద్వారా బహుమతులు
- ఒక్కొక్కరికీ రూ.9900 చొప్పున నగదు
- రాష్ట్ర వ్యాప్తంగా 110 మందికి అవకాశం

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబర్ 13 : దసరా పండుగ కోసం ప్రయాణికులకు ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులు ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలోని 9 డిపోల నుంచి 374 అదనపు బస్సు సర్వీసులు నడపనున్నారు. శుక్రవారం నుంచి 27వ తేదీ వరకు అదనపు బస్సులు నడవనున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ప్రజలు దసరా పండుగకు వారి స్వస్థలాలకు వచ్చే అవకాశం ఉండడంతో హైదరాబాద్‌కు అదనపు సర్వీసులు నడపడానికి తగిన ఏర్పాట్లు చేశారు. అన్ని డిపోలకు హైదరాబాద్ రూట్లోనే ఎక్కువ ఆదాయం వస్తుండడంతో అదనపు సర్వీసులు కూడా ఎక్కువగానే నడపనున్నారు. ప్రత్యేక బస్సుల్లో సైతం సాధారణ చార్జీలే వసూలు చేయనున్నారు. ముఖ్యంగా అచ్చంపేట, తెల్కపల్లి, డిండి, గద్వాల, అయిజ, కల్వకుర్తి, ఆమన్‌గల్, కొల్లాపూర్, కోస్గి, మహబూబ్‌నగర్, జడ్చర్ల, నాగర్‌కర్నూల్, బిజినేపల్లి, నారాయణపేట, మద్దూర్, మరికల్, మక్తల్, షాద్‌నగర్, ఆరాంఘర్, వనపర్తి, ఘనపూర్, పెబ్బేర్, కొత్తకోట తదితర ప్రాంతాలకు ఆయా డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నారు.

374 బస్సులు..

మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలోని 9డిపోల నుంచి 374 అదనపు బస్సు సర్వీసులు నడపనున్నారు. మహబూబ్‌నగర్ 54, షాద్‌నగర్ 26, వనపర్తి 54, గద్వాల 46, నారాయణపేట 34, కొల్లాపూర్ 34,నాగర్‌కర్నూల్ 34, కల్వకుర్తి 46, అచ్చంపేట 46 డిపోల వారీగా అదనపు సర్వీసులు నడిపిస్తారు.

దసరా లక్కీడ్రా..

దసరా పండుగను పురస్కరించుకొని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి టీఎస్ ఆర్టీసీ ఆఫర్ ప్రకటించింది. ఈనెల 21 నుంచి 29వ తేదీ వరకు, మళ్లీ 28 నుంచి 30వ తేదీ వరకు బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు టీఆర్ఎస్ ఆర్టీసీ ఆఫర్ అందుబాటులోకి తెచ్చింది. ఆ తేదీల్లో ప్రయాణించే ప్రయాణికులు టికెట్ వెనుకపేరు, ఫోన్ నెంబర్ రాసి బస్టాండ్లలోని డ్రాప్ బాక్సుల్లో వేయాలి. ప్రతి రీజియన్ పరిధిలో ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలను ఎంపిక చేసి నగదు బహుమతులు అందజేస్తాం. రద్దీని బట్టి మరిన్ని బస్సులు నడపడానికి తగిన చర్యలు తీసుకుంటాం.

పూల పండుగొచ్చింది

- నేటి నుంచి బతుకమ్మ తొలి రోజు ఎంగిలిపూల బతుకమ్మ
- 22న సద్దుల బతుకమ్మతో ముగింపు
- ఆడపడుచులకు అపూర్వ గౌరవం
- ఇక ఊరూరా ఉత్సవాలు షురూ..
- తొమ్మిది రోజులు
- మహిళలకు చీర సారెలు అందజేసిన ప్రభుత్వం

స్త్రీ తత్వానికి ప్రతీక

తెలంగాణ పడతుల పండుగ బతుకమ్మ. సమైక్య రాష్ట్రంలో బతుకమ్మ పండుగ ప్రాభవం కోల్పోయింది. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోని టీఆర్ఎస్ స్వరాష్ట్రాన్ని సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో పండుగకు తిరిగి గత వైభవం సంతరించుకున్నది. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఆడపడుచులంతా బతుకమ్మ బోనాలతో ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో భాగమయ్యారు. ప్రతి ఉద్యమం లోనూ ఈ పండుగ ప్రత్యేకంగా నిలిచింది. సమైక్య పాలనలో ఈ పండుగ నిరాదరణకు గురి కాగా.. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ వల్ల గుర్తింపు వచ్చింది. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి అధికారికంగా ఉత్సవాలు చేపడుతుండటం గమనార్హం. ఇందులో భాగంగా ప్రతి సంవత్సరం బతుకమ్మ సందర్భంగా ఆడపడుచులందరికీ సర్కారు సారెగా తీరొక్క రంగుల చీరలను పంపిణీ చేస్తున్నది.

బతుకమ్మ అంటేనే స్త్రీ తత్వం. చైతన్యం, యవ్వన సౌరభం దాగి ఉన్నాయి. మాతృస్వామ్య మూలాలున్నాయి. అందుకే ప్రకృతికి స్త్రీకి మధ్య ముడిపడిన బంధానికి ప్రతీకగా బతుకమ్మ నిలుస్తుంది. ఈ పండుగ పాటల్లో సంస్కృతి, సమాజం, సాంకేతిక, సంతాన సాఫల్యం, వైద్యం, స్త్రీల ఐక్యత, స్త్రీ భావజాల వ్యాప్తి, ప్రకృతిపై స్పందన ఇలా ఎన్నో అంశాలు ఉన్నాయి. ఉదాహరణగా బొడ్డెమ్మ అన్న పదంలో ఎంతో అర్థం దాగి ఉన్నది. బొడ్డి అంటే అవివాహిత కన్య. వారిని అమ్మవి చేసే పండుగే బొడ్డెమ్మ. స్త్రీ పునరుత్పత్తి శక్తికి, దేవతారాధనకు ప్రతీక. మహిళల జీవిత సార్థకత గురించి సాంకేతికంగా వివరించే పండుగ. అందుకే బతుకమ్మ పాటల్లో వైద్యం, సేద్యం, స్వేచ్ఛ, సంస్కృతి దాగి ఉన్నది. అన్నిటికీమించి కులాలకు అతీతంగా ప్రజల జీవితం ఇమిడి ఉంది. అందుకే బతుకమ్మ పాటల్లో కష్టం, సుఖం, ఉత్తేజం, ఉత్సాహం, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి, భయం మిళితమై ఉంటాయి.

ఎంగిలి పూలబ తుకమ్మతో..

ఎంగిలి పూల బతుకమ్మతో తెలంగాణ అంతటా పండుగ మొదలుకానున్నది. ప్రకృతిలో మమేకమై ఆటపాటలతో, ఆనందోత్సవాలతో నిర్వహించుకోనున్నారు. గుమ్మడి ఆకుపై ఒక్కొక్క పువ్వును పేరుస్తూ.. రంగు రంగుల పూలతో బతుకమ్మను పేర్చి పైన పసుపుతో చేసిన గౌరమ్మను ఉంచి ఆడి, పాడే పూల సంబురం మొదలుకానున్నది. జననీ జగన్మాత గౌరీదేవికి నవ వైవిధ్యాలతో, నవ నైవేద్యాలను అర్పించనున్నారు. ఆడబిడ్డలు తమ మనోభావాలను పాటల రూపంలో వెల్లడిస్తారు. పల్లె పాట ప్రతి నోట ప్రతిబింబించనున్నది.

పీయూలో బతుకమ్మ సంబురాలు

పాలమూరు, అక్టోబర్ 13 : పాలమూరు విశ్వవిద్యాలయంలోని పీజీ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం బతుకమ్మ సంబురాలు ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డా.ప్రవీణ ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీయూ ఉపకులపతి లక్ష్మీకాంతంరాథోడ్, రిజిస్ట్రార్ గిరిజా మంగతాయారు బతుకమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో వోఎస్‌డీ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, పరీక్షల నియంత్రణ అధికారి రాజ్‌కుమార్, అర్థస్‌కుమార్, కిశోర్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్

బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న అధ్యాపకులు ,విద్యార్థులు

బతుకమ్మతో వస్తున్న విద్యార్థినులు